క్లుప్తంగా

తీన్మార్ మల్లన్నకు సన్మానం



మల్లన్నను సన్మానిస్తున్న రింగు సాయితేజ

అర్వపల్లి : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ జిల్లా అధ్యక్షుడు రింగు సాయితేజ మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి విన్నవించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడేలా సీఎంతో మాట్లాడాలని కోరినట్లు చెప్పారు. అలాగే ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్లన్నను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సాయికుమార్

భానుపురి : సూర్యాపేట మున్సిపాలిటీలో అభివృద్ధి పేరుతో గత పదేళ్ల కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల కాలంలో వేలాది కోట్లను దుర్వినియోగం చేశారని అన్నారు. అవినీతిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల హస్తం ఉందని తెలిపారు. మినీట్యాంక్ బండ్, పార్కుల అభివృద్ధి, నర్సరీ, పట్టణ సుందరీకరణ పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేశారని విమర్శించారు. చేసిన గోరంత అభివృద్ధికి కొండంత అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యులు షేక్ జహంగీర్, సత్యం, పుల్లయ్య, లింగయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ ముట్టడిని విజయవంతం చేయాలి

చివ్వెంల : నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాల పట్ల 4వ తేదీన నిర్వహించే టీఎస్‌పీఎస్సీ ముట్టడిని విజయవంతం చేయాలని సేవాలాల్ సేనా రాష్ట్ర కో కన్వీనర్ ధరావతు రాజేష్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గ్రూప్ 2, 3లలో ఉద్యోగాల సంఖ్యను పెంచాలని, జీఓ నంబర్ 46 బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముట్టడిలో నిరుద్యోగులు, సేవాలాల్ సేనా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విజయమోహన్

సూర్యాపేట : ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ విజయమోహన్ అన్నారు. మంగళవారం తన జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల శ్రమను వెలకట్టలేమని అన్నారు. అనంతరం వారికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, హాస్పిటల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతకు మంగళవారం అనివార్య కారణాల వల్ల వేలం పాట నిర్వహించ లేదని మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన యథావిధిగా సంత వేలం నిర్వహిస్తామని తెలియజేశారు.

ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ విద్య

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- మద్దిరాలలో ప్రభుత్వ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతపై వైద్యసిబ్బందికి ఆదేశాలు
- తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన



మద్దిరాల ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మద్దిరాలలో తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మద్దిరాల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ విద్య అందుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండలంలో ఆయన మద్దిరాల మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. వానాకాలం సీజన్ కావడం వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ స్వర్ణ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ మార్గం సత్యనారాయణ రెడ్డి, ఎంపీఓ రాజేష్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

మద్దిరాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరానికి గానూ మంజూరైన రూ.4.24కోట్లలో రూ.2కోట్ల నిధులతో చేపట్టిన పనులకు పంచాయతీ రాజ్ ఏఈ రికార్డు ఇవ్వనందున వాటిని తనిఖీ చేయలేదని తెలిపారు. మిగతా రూ.2.24కోట్ల నిధులతో చేపట్టిన పనుల్లో రూ.2,41,303లను రికవరీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ శిరీషా, లచ్చిరామ్‌నాయక్, లింగారెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ రాజేష్, ఏపీఓ గుండు వెంకన్న, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, ఈసీ చారి, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



వెలిశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న తహసీల్దార్ సుధ, ఎంపీడీఓ లాజర్, తదితరులు

తిరుమలగిరి : మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తిరుమలగిరి తహసీల్దార్ సుధ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాజర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెలిశాల గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మొక్కలను పెంచడానికి ఉచితంగా మొక్కలను అందజేస్తోందని తెలిపారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మి, మండల పంచాయతీ అధికారి మారయ్య, గ్రామ కార్యదర్శి భీమ్‌జా తదితరులు పాల్గొన్నారు.

కోలా శంకర్ స్ఫూర్తితో పోరాటం



శంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : విప్లవ విద్యార్థి అమరుడు కోలా శంకర్ స్ఫూర్తితో నేటి యువత పోరాటాలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పూల్లూరి సింహాద్రి అన్నారు. శంకర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం సూర్యాపేట పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందాలని ఎందరో పోరాటాలు చేసి అమరులయ్యారని అన్నారు. కార్యక్రమంలో వీరబోయిన లింగన్న, గోపి, సాయి, చరణ్, సంతోష్, అనిల్, అరవింద్, చింటూ, తేజ, రమేష్, శేఖర్, మహేందర్, వంశీ, రాకేష్ పాల్గొన్నారు.

నీరు నిలువ ఉండకుండా చూడాలి



అర్వపల్లి : మురుగు నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న వైద్యసిబ్బంది



నాగారం : వర్ధమానుకోటలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో నీరు నిల్వకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎల్.చరణ్ కోరారు. మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో మంగళవారం మురుగునీటి గుంతలలో ఆయిల్‌బాల్స్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.నారాయణమూర్తి, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నాగారం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్, ప్రత్యేక అధికారి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. డ్రైనేజీలను, వీధులను ఎప్పటికప్పుడు శభ్రం చేయాలన్నారు. మురికి గుంతల్లో నీరు నిలవకుండా చూడాలని అన్నారు. వీధుల్లో నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది విష జర్వాలు ప్రబలే అవకావం ఉందని, అందుకే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ స్ప్రే చేయించాలని అన్నారు. నీటిగుంతలలో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో రోడ్లను, డ్రైనేజీలను శభం చేసే పనులు చేపట్టారు. గత ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని జీపీ సిబ్బంది తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యల పరిశీలన



8వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మంగళవారం చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు పర్యటించారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జంగాల కాలనీలో మంచి నీటి పైపు లైన్ పగిలినందున కొత్త పైపు లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షా కాలంలో వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయని, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, సిబ్బంది పరశురామ్, యాకస్వామి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి గ్రామం.. పట్టింపు శూన్యం

- రెండు మండలాల పరిధిలో కొనసాగుతున్న కంచుగట్లగూడెం గ్రామం
- కనీస సౌకర్యాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



అధ్వానంగా ఉన్న మట్టిరోడ్డు



గ్రామంలో పనిచేయని చేతిపంపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం–నాగారం రెండు మండలాల పరిధిలో ఉన్న కంచుగట్లగూడెం గ్రామంలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామం సగం ఊరు జాజిరెడ్డిగూడెం మండలం, మిగిలిన సగం నాగారం మండలం పరిధిలో ఉంది. గ్రామానికి రెండు మండలాలు ఉండటమే ప్రజలకు శాపంగా మారింది. కంచుగట్లగూడెం గ్రామాన్ని ఏ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

రెండు జీపీల నుంచి రెండు మండలాలు..

జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండలంగా ఉన్నప్పుడు కంచుగట్లగూడెం గ్రామానికి జాజిరెడ్డిగూడెం, వర్ధమానుకోట రెండు గ్రామపంచాయతీలు ఉండేవి. గ్రామంలో రెండు ప్రధాన వీధులు ఉండగా ఓ వీధి జాజిరెడ్డిగూడెం పరిధిలో, మరో వీధి వర్ధమానుకోట పరిధిలో ఉండేది. కాగా కొత్తమండలాలు ఏర్పడ్డాక ఈ గ్రామానికి మరో సమస్య వచ్చిపడింది. ఇప్పుడు ఈ గ్రామం రెండు పంచాయతీలతోపాటు రెండు మండలాల పరిధిలోకి వెళ్లింది. ఈ గ్రామానికి జాజిరెడ్డిగూడెం, నాగారం రెండు మండలాలు అయ్యాయి.

సమస్యలతో సతమతం..

రెండు మండలా గ్రామం కావడంతో కంచుగట్లగూడెంలో కనీస వసతులు కూడా సమకూరడం లేదు. గ్రామం నుంచి నాగారం రోడ్డుకు వెళ్లే రహదారి మట్టిరోడ్డు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిని బీటీగా మార్చాలని కోరుతున్నారు. గ్రామంలో ఒకటే చేతిపంపు ఉండగా అదికూడా కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. దీనిని వెంటనే మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు వేడుకొంటున్నారు. గ్రామంలోని ఒక వీధిలో మురుగు కాలువ నిర్మాణం లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. అంతేకాకుండా గ్రామంలోని డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టడంలేదు. గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ వరకు ఉన్న పైప్‌లు లీకేజీ కావడంతో నీళ్లు కలుషితమవుతున్నాయి. లీకేజీని సరిచేసి నీళ్లు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



కంచుగట్లగూడెం గ్రామం రెండు గ్రామపంచాయతీలు, రెండు మండలాల పరిధిలో ఉంది. దీంతో మా గ్రామ రోడ్డును ఎవరూ పట్టించుకోలేని పరిస్థితి ఏర్పడింది. తుంగగూడెంరోడ్డు నుంచి గ్రామానికి కేవలం అరకిలోమీటరు దూరం ఉంటుంది. ఈ మట్టి రోడ్డును బీటీగా మార్చాలి.

– కంచుగట్ల లింగయ్య, మాజీ వార్డు సభ్యుడు

పక్కా రోడ్డు నిర్మించాలి



తుంగగూడెం నుంచి మా గ్రామానికి వచ్చే రోడ్డు మట్టిరోడ్డు కావడంతో వర్షాలు పడితే నీళ్లు నిలిచి ఎటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. రెండు మండలాల అధికారులు స్పందించి మా గ్రామ మట్టి రోడ్డును పక్కా రోడ్డుగా మార్చాలి. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– పాక సోమేష్, కంచుగట్లగూడెం

కొమురయ్య వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ



అర్వపల్లి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూర్ (ఎస్) : రామన్నగూడెంలో..



నూతనకల్‌లో..

అర్వపల్లి : ఖమ్మంలో ఈ నెల 4న జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. మంగళవారం అర్వపల్లిలోని వైజంక్షన్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం నవాబు నుంచి తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేయడంలో కొమురయ్య చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కొమురయ్య త్యాగం చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య, సిలివేరు జానయ్య, రమేష్, వేముల గణేష్, మండడి శ్రీధర్, మద్ది శ్రీను, ధర్మాజి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 4వ తేదీన ఖమ్మంలో నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామన్నగూడెం, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యుడు అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, నాయకులు నల్లగొండ నాగయ్య, కంచర్ల నర్సమ్మ, కొండేటి సంజీవరెడ్డి, వీరారెడ్డి, వీరయ్య, శ్రీను, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఖమ్మంలో 4వ తేదీన నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజాం, దేశ్‌ముఖ్ భూస్వాముల నిరంకుశ విధానాలు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని అన్నారు. వారిలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, మున్నా అశోక్, మణికుమార్, గడ్డం పాపయ్య, దామెర్ల శ్రీను, గణేష్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన నిరుపేద మాచర్ల చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఆమె భర్త కూడా గతంలోనే మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబీకులకు మంగళవారం సీతారాంపురం గ్రామానికి చెందిన గుర్రాల సైదులు, బందెల శశికాంత్, బందెల యాదగిరిల తరఫున రూ.10 వేల ఆర్థికసాయాన్ని అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల అర్వపల్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో బందెల రామకృష్ణ, మాచర్ల మల్లయ్య, తిరుపతయ్య, మహేష్, చినభిక్షం, జానయ్య పాల్గొన్నారు.

నాగారం : ఈటూరుకు చెందిన యాల యాదగిరి ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై రూ.5లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర నాయకుడు, ఆర్‌కే యువ భారత్ ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాముయాదవ్ రూ.5000 ఆర్థిక సాయం పంపించారు. ఈ నగదును బీజేపీ గ్రామ నాయకులు మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తోజు ఎల్లాచారి, కన్నెబోయిన సాయిలు, కన్నెబోయిన రాములు, పేరాల బాషా, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న బందెల అర్వపల్లి



ఈటూరులో ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

రైతుల అభిప్రాయ సేకరణ

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు కాగిత రామచంద్రాపురం, తెల్లబల్లి సహకార సంఘాలలో మంగళవారం రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 10ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని అధికారులకు తెలిపారు. నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు మాట్లాడుతూ.. రైతు పక్షాన ప్రభుత్వం నిలబడి పథకాలను అమలు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి బి.రాజయ్య, జిల్లా సహకార సంఘం ఆడిటర్ శ్రీనివాస్, చైర్మన్‌లు కొల్లు రామారావు, గోసుల రాజేష్, వెంకటేశ్వర్లు, సీఈఓలు యలమందరావు, శ్రీనివాస్, బూత్కూరి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేయాలి



సన్మానం పొందుతున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేయాలని తిమ్మాపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కుంభం ప్రభాకర్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులు బింగి శోభ, మల్లికార్జునగౌడ్, జి. చంద్రారెడ్డిలను మంగళవారం పాఠశాలలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



డి.కొత్తపల్లిలో సభ్యత్వాలను అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నాగారం : డి.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. రైతు సమస్యలపై ఏఐకేఎంఎస్ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, బయ్యం లింగయ్య పాల్గొన్నారు.

వామ్మో వానరం.. బాబోయ్ శునకం!

- గ్రామాలు, పట్టణాల్లో పెరుగుతున్న కుక్కలు, కోతుల బెడద
- బాటసారులపై దాడి చేసి గాయపరుస్తున్న వైనం
- తిరుమలగిరి మండలంలో ఏడాదికి దాదాపు 400 కేసులు నమోదు



తిరుమలగిరిలో గుంపులుగా వెళ్తున్న కోతులు



తిరుమలగిరిలో కుక్కల గుంపు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో వీధి కుక్కలు, కోతుల ఆగడాలు రోజు రోజుకూ మితిమీరుతున్నాయి. రోడ్లపై వెళ్తున్న జనాలపై అకారణంగా దాడులకు పాల్పడుతూ గాయపరుస్తున్నాయి. దీంతో పాఠశాలలకు వెళ్లేందుకు చిన్నారులు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ఓ మహిళ కూరగాయలు తీసుకరావడానికి బయటకు వెళ్తుండగా ఒకేసారి కోతులు మీద పడి గాయపరిచాయి. మండలంలోని తొండ గ్రామంలో పలువురు రైతులకు చెందిన గేదె దూడలపై దాడి చేసి చంపేశాయి. మండలంలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట కుక్కలు, కోతుల బారిన పడి ఎందరో గాయాల పాలవుతున్నారు. దీంతో వీటిని చూస్తేనే ప్రజలు భయపడుతున్నారు. ఈ బెడద నుంచి విముక్తి కల్పించాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో, పట్టణాల్లో రోజుకు రోజుకూ కుక్క కాటు, కోతుల దాడుల సంఘటనలు పెరుగుతున్నాయి. అయితే ఈ సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల రేబిస్ వ్యాధి వచ్చి చనిపోయే వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది.

ఏడాదిలో 400లకు పైగా కేసులు..

ప్రతి సంవత్సరం కోతులు, కుక్కల దాడులతో గాయపడుతున్న వారి వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. తిరుమలగిరి మండలంలో ప్రతి ఏడాది 400లకు పైగానే కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కుక్కలు, కోతుల నియంత్రణపై దృష్టి పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది

కోతులు, కుక్కల బెడదతో బయటకు వెళ్లాలంటే పిల్లలు, పెద్దలు సైతం భయాందోళనతో ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామంలో కుక్కల దాడి వల్ల అకారణంగా 3 లేగ దూడలు చనిపోయాయి. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలి.

– యాకయ్య, తొండ

కోతులతో ఇబ్బందులు పడుతున్నాం

కోతులు గుంపులు, గుంపులుగా ఇళ్ల మీదనే తిరుగుతున్నాయి. తలుపులు తీసుకొని మరీ ఇళ్ల లోపలికి వచ్చి మరీ వస్తువులను తీసుకెళుతున్నాయి. కొన్నిసార్లు మీద పడి కరుస్తున్నాయి. వీటిని నియంత్రించాలి.

– విజయ, తిరుమలగిరి